నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
గురువారం | డిసెంబర్ 07, 2023 | www.navatelangana.com

కిషన్ రెడ్డిని కలిసిన బీజేపీ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



నూతనంగా ఎన్నికైన ఆదిలాబాద్, నిర్మల్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, ఏలేటి మహేశ్వర్ రెడ్డిలు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఢిల్లీలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంతో పాటు జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం కూడా బీజేపీకి వచ్చేలా ఉమ్మడి జిల్లాలో ఎన్నికైన ఎమ్మెల్యే కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించినట్టు ఎమ్మెల్యే పాయల శంకర్ తెలిపారు. రాష్ట్ర పార్టీ సూచన మేరకు క్షేత్రస్థాయిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తామన్నారు.

ఘనంగా వికలాంగుల దినోత్సవం

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగులకు కాసిపేట-2 గని వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్ చేతుల మీదుగా 60 మంది వికలాంగులకు టిఫిన్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, తెలంగాణ వికలాంగుల వేదిక మండల అధ్యక్షులు నాగురారపు సుమన్, నాయకులు కంచర్ల రాజమల్లు, పొలగాని తిరుపతి, సంతోష్, షఫీ బాబా, గోపాల్, షేర్ ఖాన్, రాజమల్లు, మున్నా పాల్గొన్నారు.

సమిష్టి కృషితో విజయాలు సాధ్యం

- ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్ కుమార్
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు పత్రాలు



ఆదిలాబాద్ టూ టౌన్ సీఐ అశోక్ ప్రతిభ పురస్కారం అందజేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమిష్టి కృషితో విజయాలు సాధ్యమవుతాయని ఆదిలాబాద్ ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్‌లోని సమావేశ మందిరంలో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో ఎటువంటి ఆటంకాలు లేకుండా, సిబ్బంది ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు ఉన్నత స్థానాన్ని కల్పించి ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కృషిచేసిన ప్రతి ఒక్క పోలీసు అధికారికి అభినందనలు తెలియజేశారు. రానున్న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి ఈ రోజు నుండి ఒక ఖచ్చితమైన ప్రణాళికను రూపొందించి అవలంబించాలని సాధ్యమైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు. పోలీస్ స్టేషన్ వారిగా పెండింగ్ కేసుల వివరాలను సిబ్బందిని అడిగి త్వరగా కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. గత నెలలో వర్టికల్స్‌లో జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 18 మంది పోలీసు అధికారులు సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేసి ప్రోత్సహించారు. కష్టపడ్డ ప్రతి ఒక్కరికి సరైన ప్రతిఫలం, రివార్డు, అవార్డుల ద్వారా అందిస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడానికి జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్క పోలీస్ అధికారి చేసిన కృషి ఉత్తమమైందని కొనియాడారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గి ప్రజల ప్రాణాలను కాపాడడంలో పోలీసులు ముఖ్య పాత్రను పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వి.ఉమేందర్, సీహెచ్ నాగేందర్, పోతారం శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, పోలీసు ముఖ్య కార్యాలయం ఏఓ భక్త ప్రహల్లాద్, ఇన్స్‌పెక్టర్లు కే సత్యనారాయణ, అశోక్, సైదారావు, చంద్రశేఖర్, శ్రీనివాస్, నరేష్, ప్రేమ్ కుమార్, సతీష్, డి సాయినాథ్, ఆర్ఐలు మురళి, నవీన్, స్వామి, డీసీఆర్‌బీ, ఐటీ కోర్, ఎస్‌బీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులు చాలా శక్తివంతులు



నవతెలంగాణ-మందమర్రి

దివ్యాంగులు చాలా శక్తివంతమైన వారని వారిలో తెలియని శక్తి ఏదో దాగి ఉందని సింగరేణి మందమర్రి ఇన్‌ఛార్జి జీఎం రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సింగరేణి హై స్కూల్ మైదానంలోని మనోవికాస్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్‌తో హాజరయ్యారు. డిసెంబర్ 3 అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలతో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎంతో ఓపికతో ఎంతో శ్రమతో మానసిక వికలాంగులకు చదువు చెప్పడం, వీరికి శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, ఆయాలకు కృతజ్ఞతలు తెలిపారు. మనో వికాస్ స్కూల్ పిల్లలకు సింగరేణి ఉద్యోగులు కూడా సహకరిస్తున్నారని, ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయ పడుతున్న అందరికీ కూడా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డీవై పిఎం ఎండీ ఆసిఫ్, మనోవికాస్ స్పెషల్ స్కూల్ మందమర్రి ఇన్‌చార్జి టి సురేఖ, పేరెంట్స్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ టి రాజలింగు పాల్గొన్నారు.

యూ డైస్‌పై అవగాహన కార్యక్రమం



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ ప్రభాకర్ బుధవారం యూ డైస్ ప్లస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తంగళ్ళపల్లి హై స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాలల విద్యార్థుల వివరాలు, పాఠశాలలకు కావలసిన సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం ఈ వివరాల ఆధారంగానే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలో పాఠశాల సౌకర్యాలు మంజూరు చేయబడతాయని తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన మధ్యాహ్న భోజనం అందేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మల్లేశం, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు డి.శ్రీనివాస్, జయ ప్రకాష్, ప్రేమలత, రిసోర్స్ పర్సన్ వేణుగోపాల్ రావు, సీపీఓ ప్రశాంత్, సిఆర్పిలు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన గిరిజన యువతికి సన్మానం



నవతెలంగాణ-నార్నూర్

కేంద్రీయ విద్యాలయంలో మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించిన గిరిజన యువతిని పలువురు అభినందిస్తున్నారు. నార్నూర్ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ కుతూరు గోదావరి పోటీ పరీక్షల్లో తన సత్తాచాటి పీటీజీ ఉద్యోగం సాధించింది. బుధవారం మండల కేంద్రంలో మైనారిటీ నాయకులు ఆమెను శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గోదావరిని ఆదర్శంగా తీసుకుని గిరిజన అమ్మాయిలు ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ దస్తగిర్, బీఆర్ఎస్ మండల కార్యదర్శి సయ్యద్ ఖాసీం, నాయకులు ఫేరోజ్ ఖాన్, బాబా ఖాన్, మహమ్మద్ ఖురేషి ఉన్నారు.

ఇందానిలో వైద్యశిబిరం



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని ఇందాని గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి గ్రామంలోని గర్భిణీలకు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలను ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ ఆధ్వర్యంలో ఇచ్చారు. చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురి రక్త నమూనాలు సేకరించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణీలు, బాలింతలు ఎప్పటికప్పుడు ఎలాంటి సమస్యలున్నా తక్షణమే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు కమల, గంగుబాయి పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడుతున్న మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు సారయ్య

నవతెలంగాణ-నస్పూర్

అవినీతికి పాల్పడుతున్న ఎస్ఆర్పీ-1 గని మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య డిమాండ్ చేశారు. ఎస్ఆర్పి-1 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లాడారు. గని మేనేజర్ విజయ్ కుమార్ కార్మికులను అకారణంగా షిఫ్ట్ మార్పిడీలు చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. యూనియన్ నాయకులను తీసుకువస్తే తీవ్ర ఇబ్బందులు తప్పవని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. నేరుగా తనను కలవాలని ఆదేశిస్తూ వచ్చిన వారిని డబ్బులు డిమాండ్ చేస్తూ లంచాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గని ప్రమాదానికి గురైన కార్మికులను షిఫ్ట్ మార్పిడీలు చేస్తూ వేదిస్తున్నారని, జీఎం చొరవతో జనరల్ షిఫ్ట్ చేస్తున్న వారిని కూడా ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. గని ఆవరణలో స్నానాల కోసం, తాగునీటి కోసం కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, మ్యాన్ రైడింగ్ నిలిపివేసి నడుచుకుంటూ వెళ్లాలని ఆదేశాలు జారీ చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులను తీవ్ర ఒత్తిడితో ఇతర పనులు చేయించుకుంటున్నారని, ప్రమాదాలకు గురైన కార్మికులను రిపోర్టులు రాయకుండా ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని బెదిరిస్తున్నట్లు తెలిపారు. మేనేజర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి అనిల్ రెడ్డి, కేంద్ర కార్యదర్శి సత్తన్న, ఫిట్ కార్యదర్శి రేగుంట సందీప్, నాయకులు పెద్దన్న, దుర్గం లక్ష్మణ్, నామాల శ్రీను, నవీన్, వెంకటస్వామి, నోముల బాలయ్య, తన్వీర్ పాల్గొన్నారు.

కక్షపూరితంగా వ్యవహరిస్తే ఊరుకోం

- ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం
- మాజీ మంత్రి జోగు రామన్న



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ప్రజల తీర్పుకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని, నియోజకవర్గంలో ప్రతిపక్ష పాత్రకు కూడా సిద్ధమే కానీ తన కార్యకర్తలను వేదిస్తే మాత్రం ఊరుకోబోనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఓటమి అనంతరం నిర్వహించిన తొలి మీడియా సమావేశం కావడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానంలో వెన్నుదండగా నిలిచిన ప్రతి ఒక్క కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల ఎన్నికల ఫలితాలలో ప్రజలు తనకిచ్చిన తీర్పును శిరసావాహిస్తున్నానని, కార్యకర్తలు శోక సంద్రంలో మునిగిపోయారని అందుకే మీడియా ముందుకు వచ్చానని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా ప్రజల కష్టసుఖాల్లో పాల్గొంటానని తెలిపారు. పదేండ్ల కాలంలో విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాలలో గణనీయమైన అభివృద్ధి సాధించామని గుర్తు చేశారు. రైతుబంధు, పింఛన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు బీమా, అమ్మ ఒడి వంటి పథకాలతో దేశం దృష్టినే ఆకర్షించామన్నారు. ప్రతిపక్షంలో బాధ్యతగా వ్యవహరిస్తామని, కొత్త ప్రభుత్వానికి తగిన సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. బీజేపీకి ఓట్లు వేయని కారణంగా బీఆర్ఎస్ కార్యకర్తలను హింసిస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. తన కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. తొమ్మిదిన్నర ఏండ్లలో సుమారు 1.60 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశామని, ఐటీ రంగంలో 18 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి చేశామన్నారు. దేశ ప్రధాని మూడు సార్లు సీఎంగా గెలిచిన గుజరాత్ వంటి రాష్ట్రాలలో సైతం లేని అభివృద్ధిని చేసి చూపామని అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో బీజేపీ నాయకులు జైశ్రీరామ్ నినాదంతో యువతను రెచ్చగొట్టి ఓట్లను దండుకుందని దుయ్యబట్టారు. తాను ఒక వర్గాన్ని ఆదరిస్తున్నాననే తప్పుడు ప్రచారంతో ఒక వర్గం ఓట్లను తనకు పడకుండా అడ్డుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే ఏ విధమైన సమన్వయంతో పని చేస్తారో చూస్తానని అనుమానం వ్యక్తం చేశారు. నూతన ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కి చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు కొబ్బరికాయలు కొట్టకుండా తన హయాంలో అభివృద్ధి చేసి చూపాలని సవాల్ చేశారు. కులాలకు, మతాలకు అతీతంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి అందించిందని కొనియాడారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే వారి పక్షన నిలబడుతానని, ఓడిన ప్రజలతోనే ఉంటానని భరోసా కల్పించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ, పట్టణ అధ్యక్షుడు అజయ్, ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, మాజీ మార్కెట్ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు.

తూకంలో కోత విదిస్తే చూస్తూ ఊరుకోం

నవతెలంగాణ-దండేపల్లి



ధాన్యం తూకంలో కోతలు విధిస్తే చర్యలు తప్పవని రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి అన్నారు. బుధవారం పల్లి మండల కేంద్రంలో కతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావును భారీ మెజారిటీతో గెలిపించినందుకు మండల ప్రజలకు కాంగ్రెస్ తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల ప్రకారం కొనుగోలు కేంద్ర నిర్వాహకులు ధాన్యం తూకంలో కోతలు లేకుండా రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా కొనుగోలు చేయాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులను తూకంలో మోసం చేస్తూ క్వింటాలుకి ఐదు కిలోల వరకు కోతలు విధించారని అలా చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. రైతు క్షేమం కొరకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని ఆయన అన్నారు. ధాన్యం కొనుగోలులో ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షులు అక్కల వెంకటేశ్వర్లు, కంది సతీష్ పాల్గొన్నారు.

సీసీఐ అధికారులు రైతులను మోసం చేస్తే ఉరుకోం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పత్తి కొనుగోళ్ల విషయంలో సీసీఐ అధికారులు రైతులను మోసం చేస్తున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా ప్రత్తి పంటకుకు పెట్టింది పేరని, జిల్లా వ్యాప్తంగా పత్తి కొనుగోళ్లు సాగుతున్నాయన్నారు. గత నెల నుండి ఈ రోజు వరకు సీసీఐ ద్వారా లక్ష 50 వేల క్వింటాళ్ల నుండి 2 లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేయాలనారు. కానీ ఇప్పటి వరకు 30 వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసిందన్నారు. అధికారుల నిర్లక్ష్యం ఉందని స్పష్టంగా కనిపిస్తుందన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా సీసీఐ అధికారులు లక్ష్యానికి అనుగుణంగా పత్తి కొనుగోళ్ల చేపట్టాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహిస్తే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు చిలుక దేవిదాస్, కుంటాల రాములు, మెస్రం భాస్కర్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలి

- ఉపాధి హామీపై సమీక్షా సమావేశం



నవతెలంగాణ-తాండూర్

ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ వి.ప్రవీణ్ కుమార్ పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీలో నర్సరీ పనులు వేగవంతం చేసి వచ్చే సంవత్సరానికి మొక్కలు అందించాలని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి కూలీల సంఖ్య 100కి తగ్గకుండా చూడాలని తెలిపారు. ఉపాధి కూలీలకు సరిపడా పనులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఉద్యానవన మొక్కలు కూడా పూర్తి స్థాయిలో నాటాలని ఆదేశించారు. అలాగే గ్రామ పంచాయతీలలో నిరంతరం పారిశుధ్య పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కోర్స్ డైరెక్టర్ సదానందం, ఏపీఓ నందకుమార్, కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో వీల్‌చేర్లు ఏర్పాటు



నవతెలంగాణ-నిర్మల్

ఆర్టీసీ బస్టాండ్‌లో వృద్ధులు, వికలాంగులు, పేషంట్‌ల కొరకు పద్మ చిల్డ్రన్ స్పెషల్ హాస్పిటల్ డాక్టర్ సాయి కృష్ణ సహకారంతో వీల్ చైరులు బుధవారం అందుబాటులో ఉంచారు. వృద్ధులు, దివ్యాంగులు, రోగులను బస్సు ఎక్కించడానికి ఉపయోగపడుతాయని డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జీఎస్.నారాయణ, టీఐ శేఖర్, కంట్రోలర్ బోజగౌడ్ పాల్గొన్నారు.

స్మార్ట్ ఫోన్లతో ఆడపిల్లలు జాగ్రత్తగా ఉండాలి



నవతెలంగాణ-మందమర్రి

స్మార్ట్ ఫోన్లతో ఆడపిల్లలు జాగ్రత్తగా ఉండాలని మందమర్రి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మహేందర్‌రెడ్డి అన్నారు. మందమర్రి సింగరేణి మహిళా జూనియర్ డిగ్రీ పీజీ కళాశాలలో బుధవారం నిర్వహించిన సైబర్ క్రైం అవగాహనా సదస్సులో సీఐ మాట్లాడుతూ విద్యార్థినులకు స్మార్ట్ ఫోన్ల ద్వారా జరిగే మోసాల గురించి ముఖ్యంగా వాట్సాప్ ఇన్‌స్టాగ్రామ్‌లలో ఏర్పడిన పరిచయాలలో ఆడపిల్లలు మోసాల గురించి వివరించారు. ఆడపిల్లలు స్మార్ట్ ఫోన్లతో చాలా జాగ్రత్తగా ఉండాలని ఎవ్వరు కూడా తల్లితండ్రులను మోసం చేయవద్దని సూచించారు. డిగ్రీ పిల్లలు గ్రూప్ పరీక్షలకి ప్రిపేర్ అవ్వాలని, మంచి ఉద్యోగాలని సాధించాలని చెప్పారు. ప్రతి నెల మొదటి బుధవారం ఒక్కో కళాశాలలో సైబర్ క్రైమ్ గురించి అవగాహనా సదస్సులు నిర్వహించాలని అందులో భాగంగానే మొదటగా సింగరేణి మహిళా జూనియర్ డిగ్రీ పీజీ కళాశాలలో నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండంట్ హీరాలాల్ ఉపాధ్యాయ, ప్రిన్సిపాల్ సుష్మ, రాజేషం పాల్గొన్నారు.

తొలిమెట్టుపై ఉపాధ్యాయులకు శిక్షణ

నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొలిమెట్టుపై ఉపాధ్యాయులకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల సముదాయ పరిధిలోని ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంఈఓ జి. మైసాజి తెలిపారు. మొదటి రోజు 50శాతం ఉపాధ్యాయులకు విద్యార్థులకు కనీస సామర్థ్యాలు, తరగతి స్థాయి సామర్థ్యాలు ఎలా సాధించాలో శిక్షణలో పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ తరగతులు నిర్వహించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేయడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓలు నర్సయ్య, వనజ, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అమీర్ కుసురు, నరసింహ చారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

2

ఆదిలాబాద్-నిర్మల్

గురువారం | డిసెంబర్ 07, 2023 | www.navatelangana.com

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం

నవతెలంగాణ-ముథోల్

అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యను అభ్యసించే పిల్లలకు పౌష్టికాహారంతో ఎదుగుదల పెరుగుతుందని ఎంపీడీఓ సురేష్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని మచ్కల్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0 నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీల్లో చేర్పే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా గర్భిణులకు బాలింతలకు పౌష్టికాహారం యధావిధిగా అందించాలన్నారు. ఆయన వెంట ఏపీఓ శిరీష ఉన్నారు.



అంబేద్కర్ అడుగుజాడల్లో నడువాలి

నవతెలంగాణ-కుభీర్

భారత రాజ్యాంగ సృష్టి కర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడిచేలా కృషి చేయాలని మండల బీజేపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఏశాల దత్తాత్రి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కుభీర్, పార్డి(బి), పల్సి, సోనారి, గోడపూర్, డోడార్నాతో పాటు అన్ని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలో మండల, తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీఓ కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటాలకు పూజలు చేసి జెండా ఎగురవేశారు. ఆయా గ్రామాల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఉన్న ప్రజల జీవితంలో వెలుగులు నింపిన మహానుభావుడు అంబేద్కర్ ఎన్నో పోరాటాలు చేసిన మేధావని అన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఒక్క యువకులు అంబేద్కర్ అడుగుజాడల్లో నడిచేలా కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు అధ్యక్షులు కుల సభ్యులు కోఆప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్, సర్పంచులు మీరా విజయ్ కుమార్, ఆనందరావు పటేల్, కవిత రాజేష్, తూము పుష్పాలత



లక్ష్మణచాందలో..

రాజేశ్వర్, మండల నాయకులు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నిర్మల్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహనీయుని అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడువాలని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. బుధవారం అంబేద్కర్ 67వ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని నిర్మల్ పట్టణంలోని ధర్మసాగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై ఉన్న విగ్రహానికి దళిత సంఘ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి మరువలేదని అన్నారు. అసమానతలు లేని సమాజం కోసం అనునిత్యం పరితపించిన మహానేత అన్నారు. ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని, ఆయన చూపిన బాటలో మనందరం ముందుకు నడువాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ, కౌన్సిలర్స్ ముజ్జు చౌస్, నల్లూరి పోశెట్టి, పూరడి శ్రీకాంత్, నాయకులు బొడ్డు లక్ష్మణ్, రాజేశ్వర్, రాఘవ, దేవేందర్, శివ, భూపతి, సంజీవ్, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

బీజేపీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించారు. స్థానిక మినీ ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయ సాధనను బీజేపీ ముందుండి నడిపిస్తుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అంజు కుమార్‌రెడ్డి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు రాచకొండ సాగర్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణంలోని విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఘననివాళులర్పించారు. ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాల మౌనం పాటించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. వారు రచించిన రాజ్యాంగాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటపాటలు, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గడిపాలి సుభాష్, పాఠశాల ప్రిన్సిపాల్ సుమతీదేవి కరస్పాండెంట్ వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడెం : అణగారిన వర్గాల అభివృద్ధికి బాటలు వేసిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని ఎంపీపీ ఆంటోనీ అలెగ్జాండర్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ప్రపంచంలోని మేధావులకే మేధావి అంబేద్కర్ అని అన్నారు. నేటి యువత అంబేద్కర్ అడుగుజాడల్లో నడిచి విజయాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

అంబేద్కర్ తన చిట్ట చివరి క్షణం వరకు తన ఆశయ సాధన కోసం ఎంతగానో కృషి చేశారని వారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ వెంకటేష్, ఎంపీటీసీ నర్సింగ్ రమేష్, నాయకులు తుమ్మల మల్లేష్ యాదవ్, జాడి ఇందూర్, పడిగెల భూషణ్, కమలాకర్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ స్థానిక ఎంపీపీ కార్యాలయ ఆవరణలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ చూపిన మార్గం ప్రతీ ఒక్కరూ అనుసరించి సమాజ శ్రేయస్సుకు పాటు పడాలని అన్నారు. ఏస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయంలో జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ ఆధ్వర్యంలో, కనకపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ మేకల రాజేందర్ యాదవ్ ఆధ్వర్యంలో, చామన్ పల్లి గ్రామంలో అంబేద్కర్ సంఘ నాయకులు సాగర్, ప్రగత్ ఆధ్వర్యంలో, మునిపల్లి గ్రామంలో అంబేద్కర్ సంఘ నాయకులు గోలి గంగాధర్, బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముత్యంరెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ రాజేశ్వర్, సుమన్, సుంకరి రవి, బొజ్జ నగేష్, భూమారెడ్డి, రాకేష్, శ్రీకాంత్, శివలింగం పాల్గొన్నారు.

ముథోల్ : అందరికి ఆదర్శప్రాయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని దళిత సంఘాల నాయకులు అన్నారు. బుధవారం అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ముథోల్‌లో ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి దళిత



తాంసిలో..



నిర్మల్‌లో..

సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమాజంలోని అంటరానితనం, అసమానతలు, వివక్షలపై అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నింపిన బాబాసాహెబ్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ చదవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధమహాసభ పదాధికారులు గంగాధర్ చందనే, బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మాజీ ఉపసర్పంచ్లు మోహన్, దశరథ్, బీజేపీ నాయకులు సతీష్‌రెడ్డి, తాటివార్ రమేష్, సపటోళ్ల పోతన్న, అనిల్ దళిత సంఘాల నాయకులు రాహుల్, లక్ష్మణ్, అఖిలేష్ పాల్గొన్నారు.

బాసర : ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి డైరెక్టర్ సతీష్ కుమార్, ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అందరివాడిగా చరిత్రలో నిలిచిపోయిన ఏకైక వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహనీయుడని అన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ కోఆర్డినేటర్ శ్రీదావులు, అసోసియేట్ డీన్స్ డాక్టర్ నాగసాయి, డాక్టర్ దత్తు, ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్ కో కన్వీనర్ డాక్టర్ విఠల్, వసంత్ బాబు, పీఆర్ఓ డాక్టర్ విజయకుమార్ నాన్ టీచింగ్ అధ్యక్షులు శాంబాబు, ఎస్సీ, ఎస్టీ సెల్ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్ : అన్ని వర్గాల స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్ అని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు.



తలమడుగులో..

బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్నామని అంతేకాక అన్ని రంగాలలో అభివద్ధిని సాధించుకున్నామని తెలిపారు. అంబేద్కర్ స్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణలో తాము హక్కుల సాధన దిశగా, ప్రజాక్షేత్రంలో ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ, పట్టణ అధ్యక్షుడు అజయ్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బండారి సతీష్, దుర్గం శేఖర్, స్వరూపరాణి, వేణు యాదవ్, కౌన్సిలర్లు అశోక్ స్వామి, వెంకన్న, ప్రకాష్, నాయకులు ప్రశాంత్, సాయబ్‌రావ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ ఘనంగా నివాళులర్పించారు. స్థానిక షెడ్యూల్డు కులాల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి అంబేద్కర్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి కలెక్టర్, అధికారులు, కులసంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ రూపకర్త, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరగని కృషి చేసిన మహనీయుడు బాబాసాహెబ్ అని కొనియాడారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరిలో ఉన్నత చదువులు చదివేలా చైతన్యం కలిగించారని అన్నారు. సమాజంలో అందరు సమానమేనని ఐక్యమత్యంతో జీవించాలని చాటిచెప్పారని అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, యువత నూతన ఒరవడిని సృష్టించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖ అధికారి సునీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, డీఆర్డిఓ కిషన్, ఆయా సంఘాల నాయకులు, అధికారులు, ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి : డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం భీంపూర్, తాంసి మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాల్లో పార్టీలకు అతీతంగా ఘన నివాళులర్పించారు. తాంసి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్‌తో పాటు వివిధ పార్టీల నాయకులతో కలిసి మొదటగా పంచశీల జెండాను ఆవిష్కరించి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు అరుణ్ కుమార్ మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణం వల్లనే దళిత బహుజన అగ్ర కులాలకు అన్నిట్లో చదువుల్లో రాజకీయాల్లో రిజర్వేషన్ అమలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, వివిధ పార్టీల నాయకులు గోవర్ధన్‌రెడ్డి, రామన్న యాదవ్, కాంతరెడ్డి, గంగారాం, మహేందర్‌రెడ్డి, యువజన సంఘం సభ్యులు ప్రవీణ్, శ్రీనివాస్ ఉన్నారు.

తలమడుగు : అంబేద్కర్ ఆయశ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాలమహార్ సంఘం, నాయకులతోపాటు బ్లూబీమ్ యూత్ నాయకులు అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 67వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, పంచశీల చదివారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న బడుగు బలహీన వర్గాల పెన్నిదని అన్నారు. ఈ సందర్భంగా మహనీయుని సేవలను గుర్తు చేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు అసం రవి, భూత దేవన్న, రావుల నర్సింగ్, రవి, దిలీప్, మాణిక్ రావు, ఆనంద్, బాపన్న, కేశవ్, గంగాధర్, యూత్ సభ్యులు శేఖర్, ఆశన్న, సంజీవ్, చింటు, సురేష్, ప్రశాంత్, రాములు, శివమణి, అజయ్, అశోక్, జాన్, సంతోష్, సందీప్, వినయ్ ప్రశాంత్ పాల్గొన్నారు.

హోంగార్డులు పెన్షన్ పథకాల్లో చేరడం ఉత్తమం : ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

హోంగార్డులు పెన్షన్ పథకాల్లో చేరడం ఉత్తమమని జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని హోంగార్డు జిల్లా కార్యాలయంలో ఉదయం హోంగార్డ్ రైజింగ్ డే ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంగార్డులకు రైజింగ్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. మొదటగా హోంగార్డ్ యూనిట్ ద్వారా ఏర్పాటు చేసిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. హోంగార్డుల జెండాను ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డు రైజింగ్ డే సందర్భంగా హోంగార్డులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, హోంగార్డులకు పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం ద్వారా పెన్షన్ ఉండదని అన్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడే ప్రభుత్వ, ప్రయివేటు పెన్షన్ పథకాల్లో చేరడం ఉత్తమమని హోంగార్డులకు సూచించారు. పోలీసులతో సమానంగా నిస్వార్థమైన విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. హోంగార్డుల సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారాలకు కృషి చేస్తానని తెలియజేశారు. హోంగార్డులు సమయానుసారంగా విధులకు హాజరవుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులతో సమానంగా పనిచేస్తున్నారని తెలిపారు. అన్ని క్లిష్టతరమైన బందోబస్తులు, శాంతి భద్రతల పరిరక్షణలో నిర్వహించే పోలీసుల అన్ని విభాగాల్లో హోంగార్డుల సైతం తమ వంతు సహకారం అందిస్తున్నారని తెలిపారు. తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారని తెలిపారు. అనంతరం హోంగార్డు అధికారులు పోలీసు అధికారులు కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కాగా పట్టణంలో ర్యాలీ చేపట్టగా జిల్లా ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ప్రారంభమై కలెక్టర్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వి.ఉమేందర్, సీహెచ్ నాగేందర్, పోతారం శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు స్వామి, నవీన్, మురళి పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, హోంగార్డ్ ఆఫీస్ అధికారులు రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

● ఘనంగా హోంగార్డుల రైజింగ్ డే ఉత్సవం



ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి యువకుడి మృతి

నవతెలంగాణ-బాసర

ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి యువకుడి మృతి చెందిన సంఘటన బాసర గోదావరి నది వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరస్వతిదేవి అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తుడు బుధవారం గోదావరిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మేడ్చల్ జిల్లా గజ్జుల తండాకు చెందిన వరుసకు బావ బామ్మర్దులైన శ్రీనివాస్, మృతుడు నాగరాజు గోదావరిలో స్నానానికి వెళ్లారు. మొదట గుండు గీయించుకున్న మృతుడు నాగరాజు(35) గోదావరిలో దిగి ప్రమాదవశాత్తు మునిగి చనిపోయాడు. అక్కడే ఉన్న మృతుడి బావ శ్రీనివాస్ కాపాడండి అంటూ ఆర్తనాదాలు చేసిన ఎవరు పట్టించుకోలేదని స్థానికంగా గజ ఈతగాళ్లు ఉంటే నైనా తన బామ్మర్ది బతికి ఉండేవాడని వాపోయాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సాయంతో వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం బైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గణేష్ తెలిపారు.

బాసర అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బాసర

శ్రీజ్ఞాన సరస్వతిదేవి అమ్మవారిని బుధవారం ముథోల్ నూతన ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న వీరిని ఆలయ అధికారులు అర్చకులు మంగళ వాయిద్యాలుతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యేచే ఆలయా అర్చకులు ప్రత్యేక కుంకుమార్చన పూజ జరిపించి హారతినిచ్చి ఆశీర్వదించారు. ఆలయ చైర్మెన్ శరత్‌పాటక్, ఆలయ ఈఓ విజయ రామారావు, ఎమ్మెల్యే రామారావు పటేల్ శాలువాతో సత్కరించి అమ్మ వారి ఫోటోను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ అమ్మవారి ఆలయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక నిధులతో అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముథోల్ నియోజకవర్గం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల బీజేపీ కార్యకర్తలు పార్టీ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే పర్యటన దృష్టిలో ఉంచుకొని ఎస్సై గణేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, సతీశ్వర్ రావు, జెడ్పీటీసీ వసంతా రమేష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్ పటేల్, రమేష్, సాయినాథ్ ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలి

● మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-బేల

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం మండలంలోని బెదోడ గ్రామంలో నిర్వహించిన పుణ్యతిథి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. బాజీరావు బాబా చూపిన సన్మార్గంలో శాంతి స్థాపనతో పాటు ఆధ్యాత్మికాన్ని పెంచుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం ఇటీవల మండలంలోని పాటన్, సాంగిడి గ్రామాల్లో మృతి చెందిన మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్, బీఆర్ఎస్ నాయకులు గంభీర్ ఠాక్రే, పార్టీ మండల అధ్యక్షులు కళ్లెం ప్రమోద్‌రెడ్డి, దేవన్న, జక్కుల మధుకర్, సతీష్ పవార్, బండి సుదర్శన్, మంగేష్ ఠాక్రె, మధుకర్ బాలేరావ్, గోడే మధుకర్, కన్నాల మహేందర్, విశాల్ గోడే పాల్గొన్నారు.

ఆర్టీసీలో అప్రెంటీస్ ధరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్‌లో ఐటీఐ అప్రెంటీస్ చేయడానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డిపో మేనేజర్ కల్పన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ డీజిల్ మెకానిక్ ట్రేడ్ కోర్స్ పూర్తిచేసిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు జిల్లాలోని ఆయా డిపోలలో అప్రెంటీస్ షిప్ చేయుటకు ఆసక్తిగల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.అప్రెంటీస్‌షిప్‌ఇండియా.ఓఆర్జీ వెబ్‌సైట్‌లో ఈనెల 15 లోపు తమ అర్హత వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులును మెరిట్ రిజర్వేషన్ ప్రతిపాదికన ఎంపిక చేసి ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఆరు డిపోలలో అవసరం మేరకు ఐటీఐ అప్రెంటీస్ షిప్ మేరకు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షణకు ఆర్టీసీ టూర్ ప్యాకేజీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 24న అరుణాచలం గిరి (కానిపాకం, వేలూరు) పుణ్యక్షేత్రం వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ టూర్ ప్యాకేజ్ రూ.5వేల ముందస్తు రిజర్వేషన్ నేటి నుంచి ప్రారంభమవుతుందని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ కొరకు బస్ స్టేషన్ ఆదిలాబాద్ రిజర్వేషన్ కౌంటర్ లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్టీసీఆన్‌లైన్.ఇన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 7382800975, 7382840334 నెంబర్ కు సంప్రదించాలన్నారు.

హెవీ మోటర్ వెహికల్ ట్రైనింగ్ నూతన బ్యాచ్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీఎస్‌ఆర్టీసీ ఆదిలాబాద్ డిపోలో హెవీ మోటర్ వెహికల్ డ్రైవర్స్ ట్రైనింగ్ మరో బ్యాచ్ 2024 జనవరి 1 నుంచి ప్రారంభించనున్నామని డిపో మేనేజర్ కల్పన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు హెవీ మోటార్ డ్రైవింగ్ నేర్చుకోవడానికి ఆదిలాబాద్ డిపో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం 30 రోజుల పాటు ఉంటుందని పేర్కొన్నారు. దీనికి ఫీజు రూ.15వేల 600 ఉంటుందని ఆసక్తిగల అభ్యర్థులు తప్పనిసరిగా లైట్ మోటర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు ఆదిలాబాద్ డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్ యూసుఫ్ సెల్‌ఫోన్ నెంబర్ 7382840349 సంప్రదించాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | డిసెంబర్ 07, 2023 | www.navatelangana.com

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-కౌటాల



ఇటీవల మండలంలోని గురుడుపేట గ్రామానికి చెందిన బాధితుడు సుధాకర్ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ పోర్టల్లో ఫిర్యాదు చేయగా ఎస్సై ఎస్ మధుకర్ సెల్‌ఫోన్ ఐఎంఈ నెంబర్ ద్వారా సెర్చ్ చేయడంతో సెల్‌ఫోన్‌ను దొంగలించిన వ్యక్తి నుండి స్వాధీనం చేసుకొని ఫిర్యాదు దారునికి బుధవారం సెల్‌ఫోన్‌ను అప్పగించారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను తిరిగి అందించడంతో ఎస్సైకి బాధితుడు ధన్యవాదాలు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా సెల్‌ఫోన్ దొంగలించబడిన, పోగొట్టుకున్న సీఈఐఆర్ పోర్టల్లో ఫిర్యాదు చేసినట్టయితే ట్రాప్‌చేసి సెల్‌ఫోన్‌ను రాబట్టడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

నవతెలంగాణ-మందమర్రి

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని వైయస్సార్ టీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు షేక్ అజీమొద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుద్దాల ప్రభుదేవ్ అన్నారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని మందమర్రి మార్కెట్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంబేద్కర్ అందరి వాడని, ఆయన ఆశయాలను భారత పౌరులందరూ కొనసాగించాలని తెలిపారు. యువత అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుంటు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఓరం కవిరాజ్, సేవ దళ్ జిల్లా అధ్యక్షుడు గద్దె సాయి, కిషోర్, మందమర్రి మండల యువజన విభాగం అధ్యక్షుడు జావిద్ పాషా, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి రాజేశ్వరి, గోవర్ధ, జిల్లా యువజన నాయకులు గోల్కొండ జైచందర్, గోపాల్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక



నవతెలంగాణ-తాండూర్

తాండూర్ సబ్ స్టేషన్ ఆవరణలో బుధవారం డివిజనల్ విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించారు. వినియోగదారుల వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు అందించారు. వాటిని పరిశీలించి పరిష్కరించేల చర్యలు తీసుకుంటామని అధికారులు భరోసా ఇచ్చారు. బిల్లులు, మీటర్ల మార్పిడి, వ్యవసాయ కనెక్షన్లపై ఫిర్యాదుల అందినట్లు ఏఈ ప్రభాకర్ తెలిపారు. వినియోగదారుల నుండి వచ్చిన ఫిర్యాదుల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ సీజీఆర్ అధికారులు, బెల్లంపల్లి డీఈ రాజన్న, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

17న కాగజ్‌నగర్‌లో ట్రస్మా ఎన్నికలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

17న కాగజ్‌నగర్ కేంద్రంలో ప్రైవేట్ పాఠశాల యూనియన్(ట్రస్మా) ఎన్నికల నిర్వహించనున్నట్టు, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు హాజరుకావాలని ట్రస్మ జిల్లా అధ్యక్షుడు కిషన్ రావు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సమావేశానికి హాజరు కావాలన్నారు. ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కరం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవ భూషణం, అసోసియేట్ అధ్యక్షుడు రాధాకృష్ణ చారి పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్‌కు సన్మానం



నవతెలంగాణ-తాండూర్

ఖాతాదారులతో ప్రత్యక్ష సంబంధాలున్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ప్రభుదాస్ బదిలీ అయ్యారు. బుధవారం బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు మేనేజర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ తాండూరు మండలంలోని ప్రజలు తమకు ఎంతగానో సహకరించారన్నారు. తనకు తొడ్పటునందించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదలు తెలిపారు.

జనవరి 4 నుండి డీఈడీ పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జనవరి 4వ తేదీ నుండి డిప్లమా ఇన్ ఎడ్యుకేషన్(డీఈడీ) పరీక్షలు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాధికారి అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 4 నుంచి 10వ తేది వరకు కొనసాగుతాయన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు విషయాన్ని గమనించాలన్నారు.

11 మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మండల సర్వసభ్య సమావేశాన్ని 11న నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ శశికళ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు అభివృద్ధి నివేదికలు తీసుకొని ఉదయం 10 గంటలకు మండల కార్యాలయంలో జరిగే సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

ఐటీఐ అప్రెంటిస్ కోసం దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

టీఎస్ఆర్టీసీ ఆసిఫాబాద్ డిపోలో ఐటీఐ అప్రెంటిస్ చేయడం కోసం అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు డిపో మేనేజర్ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఐటీఐలో డీజిల్ మెకానిక్, ట్రేడ్ కోర్స్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.అప్రెంటిస్‌షిప్‌ఇండియా.ఓఆర్‌జీలో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను రిజర్వేషన్ మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని ఆరు డిపోలలో అప్రెంటిస్ కోసం కేటాయిస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు డిపో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేడు ఉచిత గ్రహణ మొర్రి శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బసవతారకం స్మైల్ ట్రైన్ సెంటర్-బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, సమగ్రశిక్షా ఆధ్వర్యంలో ఈనెల 7న గ్రహణ మొర్రి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాధికారి ప్రణీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల ప్రాంగణంలోని భవిత కేంద్రంలో నిర్వహించే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రహణ మొర్రి ఆపరేషన్ జరిగిన వారు, చేసుకోనివారు 6 నెలల నుంచి 50 ఏండ్ల లోపు వారు హాజరు కావచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ కోరారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు

● వివిధ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి



ఆసిఫాబాద్‌లో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సక్కు, నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాజ్యాంగ రచన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 67వ వర్ధంతి వేడుకలు బుధవారం జిల్లా కేంద్రంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చేసిన సేవలు కొనియాడుతూ ఆయన స్మృతులను గుర్తు చేసుకున్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో...

జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతి వేడుకలకు మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు హాజరయ్యారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, డీపీఓ ఉమర్ హుస్సేన్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సతీష్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

జిల్లా కేంద్రంలోని బీసీ సంఘ భవనంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరగడే మారుతి, ఆరే సంక్షేమ సంఘం సభ్యుడు కోలే సదాశివ పాల్గొన్నారు.

మహార్ సంఘం ఆధ్వర్యంలో...

మహార్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో ఘనంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు. త్రిశరణ పంచశీల వందనం చేయడంతో పాటు, మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సుధాకర్ దుర్గే, గౌరవ అధ్యక్షులు, మురళీధర్ జాడే, కొండయ్య దుర్గే, కోశాధికారి లింగయ్య చంద్రి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం దుర్గే, జైభీమ్ సేన అధ్యక్షులు వినోద్ జాడే, గౌరవ అధ్యక్షులు అశోక్ జాడే, జన్కపూర్ అధ్యక్షులు, అనీల్ కుమార్ దుర్గే, వినేయ్ మహారాజ్, కోటేశ్వర్ ఉగ్రే, అజీత్ కుమార్ కట్కార్, సందీప్ నగర్ మహార్ సంఘం సభ్యులు రాజశేఖర్ విరగాడే, కాంబ్లె ఆగ్నేష్, బాబురావు విరగాడే, మహిళ మండలి సుష్మ దుర్గే, శాంతబాయి దుర్గే, చంద్రకళ తాటుపల్లి, సునీత దుర్గే, సునీత జాడే, భారతి జాడే, సుప్రియా, ప్రమీల జాడే, గంగుబాయి చంద్రి, శాంతబాయి విరగాడే పాల్గొన్నారు.



కెరమెరిలో..

రెబ్బెన : రాజ్యాంగంలో అన్ని వర్గాల ప్రజలకు హక్కులు కల్పించిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుందని ఆక్టివిస్టు సమాచార హక్కు రక్షణ చట్టం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కమలాకర్ అన్నారు. బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి వేడుకలను మండలంలోని నారాయణపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు సుగుణాకర్, పవన్‌కళ్యాణ్, తిరుపతి, శంకర్, నవీన్, వరుణ్ పాల్గొన్నారు.

ఎస్సీఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వర్ధంతిని ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మారుపెల్లి అంబేద్కర్, తిరికొండ శంకర్,మల్లారపు కుమారస్వామి, చేదం భీమయ్య, దుర్గం రాజ్‌కుమార్, భిక్షపతి, సిరికుల్ల జనక్‌ప్రసాద్, మహిళా నాయకురాలు తేజస్విని పాల్గొన్నారు.



రెబ్బెనలో..

బెజ్జూరు : మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కెరమెరి : అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అంబేద్కర్ 67వ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. అనంతరం జాఫర్ మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద వివరణాత్మక లిఖిత రాజ్యాంగాన్ని రచించినటువంటి భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు, బలహీన వర్గాల విప్లవ నాయకుడు, డాక్టర్ భీం రావు రాంజీ అంబేద్కరని పేర్కొన్నారు. చదువు కోవాలన్నా, నీళ్లు తాగాలన్నా, బడి, గుడికి వెళ్లాలన్నా కులం అడ్డు వచ్చేదని తెలిపారు. అంటరానితనానికి వ్యతిరేకంగా 1927 నుండి అంబేద్కర్ అనేక పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. బోధించు, సమీకరించు అనే నినాదాలతో ప్రజలను చైతన్యవంతం చేశారన్నారు. మొదటి న్యాయ శాఖ మంత్రిగా దేశానికి ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. ప్రపంచంలో ఎక్కువ విగ్రహాలు ఉన్న నాయకులలో అంబేద్కర్ ఒకరని ఆయన సేవలను కీర్తించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహర్లే తిరుపతి సెండే లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల : అసమానతలను అంతంచేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాజ్జెల మౌనీష్, ఉప సర్పంచ్ తిరుపతి, కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ అలీ, బీఆర్ఎస్ మండల యువజన సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, డబ్బ గోపాల్, బసార్కర్ అశోక్, రమేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని జశ్వంత్ బుద్ధవిహార్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని పిలుపు ఇచ్చారు. యువత ఆ దిశాగా ముందుగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్, మండల అధ్యక్షుడు జయరాం, మౌల్కార్ సంఘం అధ్యక్షుడు విజయ్, శ్యాంరావు పాల్గొన్నారు.



కాసిపేటలో..



కౌటలలో..



వాంకిడిలో..

మహిళలు నిర్భయంగా సంప్రదించాలి

● ఆసిఫాబాద్ ఎస్పీ కే సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళలు నిత్యజీవితంలో వారికి ఎదురవుతున్న సమస్యలతో పాటు, విద్యార్థినీలు ఎదుర్కొంటున్న ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ లాంటి వాటిపై నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. పోలీస్ హెడ్ క్వార్టర్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని, మహిళల రక్షణ కోసం షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినీలు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ర్యాగింగ్, ఈవీటిజింగ్, ఫోక్సో, షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కార్యక్రమాల నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా నవంబర్ నెలలో షీటీంకు ఒక్క ఫిర్యాదు నమోదు చేశామని, అలాగే 39 హాట్ స్పాట్స్ తనిఖీ చేస్తూ 6 అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థినిని వేధించిన వాడిని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. చిన్న పిల్లల రక్షణ విషయంలో పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. మహిళలు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరుగా సంప్రదించలేని వారు 8712670564, డయల్ 100కు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



శారీరక, మానసిక పెరుగుదలకు క్రీడలు తోడ్పడుతాయి

● గిరిజన క్రీడలాధికారి మీనారెడ్డి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థుల శారీరక, మానసిక పెరుగుదలకు క్రీడలు ఎంతగానో తోడ్పడుతాయని జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి అన్నారు. జిల్లా క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో నిర్వహించిన అండర్-17 బాలికల హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించడం గర్వంగా ఉందని, ప్రతి ఒక్కరు రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిలో ప్రబాబుల్స్‌కి 22 మందిని ఎంపిక చేసి వారికి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ఎస్జీఎఫ్ కార్యదర్శి సాంబశివరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 100 మంది బాలికలు పోటీపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్ బాల్ కోచ్ అరవింద్, అథ్లెటిక్స్ కోచ్ విద్యాసాగర్, ఫుట్బాల్ కోచ్ రవి, ఆయా జిల్లాల కోచ్, వ్యాయామ ఉపాధ్యాయులు రాకేష్, మల్లిక, లక్ష్మి రవి, రజిత పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచాయం చేసుకుంటున్న అధికారులు

గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

గర్భిణులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు నెలనెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. బుధవారం కార్యాలయ సమావేశ మందిరంలో సంక్లిష్ట గర్భిణుల గుర్తింపు మరియు ప్రసవ నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ గర్భిణీ అని తెలిసిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. క్రమం తప్పకుండా టీకాలు ఇవ్వడంతో పాటు నెలనెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్సలు అందించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని తెలిపారు. ప్రసవానికి వారం రోజుల ముందే ఆస్పత్రికి తరలించాలని సూచించారు. జీరో మరణాల రేటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గర్భిణులను గుర్తించినంతరం ఆశా, ఆరోగ్య కార్యకర్తలు సూపర్వైజర్ల సహాయంతో నెలనెల చికిత్సలు అందించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేల వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో తిరుగుతూ గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుంటూ వారికి పౌష్టికాహారం అవశ్యకత గురించి వివరించాలని ఆదేశించారు. ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేల చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన, పీఓడీటీ డాక్టర్ మనోహర్, జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ ఎం శ్రీధర్ పాల్గొన్నారు.

ఆపరేషన్ వికటించి మహిళా మృతి

నవతెలంగాణ-హాజీపూర్

గర్భసంచి ఆపరేషన్ వికటించి మహిళ మృతి చెందిన సంఘటన హాజీపూర్ మండలంలో బుధవారం చోటు చేసుకుంది. మృతురాలు సోదరుడు తెలిపిన వివరాల ప్రకారం.. టికన్నపల్లి గ్రామానికి చెందిన మేడం రమ(24)కు గత పది రోజుల కింద కడుపు నొప్పి రావడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లగా రమకు గర్భ సంచికి గడ్డలు ఉన్నాయని వైద్యులు నిర్ధారించారు. డాక్టర్ మందులతో తగ్గిపోతుందని తెలిపాడు. తగ్గగా పోతే ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. మంగళవారం రాత్రి గర్భసంచి ఆపరేషన్ చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు రమకు రక్త స్రావం కావడంతో మధ్యాహ్నం ఒంటి సమయంలో మృతి చెందింది. రమ రెండు సంవత్సరాల క్రితమే అదే గ్రామానికి చెందిన యాదగిరి అనిల్ అనే వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. ఏడాది క్రితం ఇద్దరి మధ్య మనస్పర్థాలు రావడంతో తన తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఈ ఘటనతో మండలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

8 నుంచి ప్రతిమ ఆస్పత్రిలో వైద్య సేవలు

నవతెలంగాణ-నార్నూర్

కరీంనగర్ జిల్లాలోని ప్రతిమ ఆస్పత్రిలో 8 నుండి 12 వరకు నిర్వహించే ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రతిమ ఫౌండేషన్ సభ్యులు వాగ్మారే భావ్‌రావ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గర్భకోశ వ్యాధులు, ఇన్ఫెక్షన్లు, చిన్న పిల్లల ఆరోగ్య సమస్యలపై చికిత్స నిర్వహిస్తారన్నారు. రోగులు కేవలం మందుల ఖర్చులు భరించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాల కోసం 7989082259, 9701954709 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.ఈ అవకాశాన్ని మండ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు సాగరిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన జెల్ల సాగరిక రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న బుధవారం తెలిపారు. ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న క్రీడాకారిని జెల్ల సాగరిక రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. వచ్చే 8,9,10 తేదీల్లో మంచిర్యాలలో జరిగే హాండ్ బాల్ ట్రోఫీలో సాగరిక పాల్గొనబోతున్నారని పీఈటీ మాధురి తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఉపాధ్యాయులు, పీఈటీ మాధురి, తదితరులు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన సాగరికను అభినందించారు. క్రీడల్లో ఉన్నతంగా రాణించడం ద్వారా సాగరిక క్రీడాకారిణిగా మరింత పైకి ఎదగాలని, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

సుదర్శన్‌రెడ్డి గెలుపుతో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఎడపల్లి

కాంగ్రెస్‌పార్టీనుంచి బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా పొద్దు టూరి సుదర్శన్ రెడ్డి గెలుపొం దడంతో పోచారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నీరడి రవికుమార్ పోచమ్మఆలయం వద్ద బుధవారం తన మొక్కులు చెల్లించుకున్నాడు. ఎన్నికల్లో సుదర్శన్ రెడ్డి గెలుపొందితే పోచమ్మ ఆలయంలో 101కొబ్బరికాయలు కొడతానని రవి కుమార్ మొక్కుకున్నారు. ఈ క్రమంలో ఆయన గెలుపొం దడంతో పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ , బిల్లా రామ్మోహన్, గ్రామస్తులతో కలిసి రవికుమార్ పోచమ్మ ఆలయం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కుని చెల్లించుకొన్నారు. కార్యక్రమంలో విజయ్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నీరడి రవికుమార్, మాజీ ఎంపీటీసీ సాయన్న, సుంకరి సుదర్శన్, జక్కుసాయన్న, గోవింద్ రెడ్డి, కట్ట లక్ష్మయ్య, కట్ట సాయిలు, కోలవిజయ చందర్,వై కుమార్,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆకాంక్షలను
కొత్త ప్రభుత్వం నెరవేర్చాలి

- ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కార్మికుల ఆకాంక్షలను కొత్త ప్రభుత్వం నెరవేర్చాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) నాయకులు అన్నారు. జిల్లా కార్యవర్గ సమావేశం శ్రామిక భవన్, కోటగల్లిలో బుధవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో కొత్తగా ఏర్పడబోతున్న రాష్ట్ర ప్రభుత్వ హామీలు, కార్మికుల కర్తవ్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వనమాల కృష్ణ, కే.సూర్యం మాట్లాడుతూ... తెలంగాణా ఉద్యమ ఆకాంక్షలను తుంగలో తొక్కడం, అంతులేని అహంకారం, అప్రజాస్వామిక, నిరంకుశ విధానాలు అనుసరించడం, ముఖ్యంగా కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అనుసరించడం వల్లనే ఓటర్లు టీఆర్ఎస్, కేసీఆర్‌కు పరాజయం, పరాభవం ఇచ్చారన్నారు. కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయకపోవడం, కనీస వేతనాలు కూడా అమలు చేయకపోవడం కేసీఆర్ సర్కార్ వైఫల్యమని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని కేసీఆర్ సర్కారుకు తెలంగాణ ప్రజలు, కార్మికులు తగిన గుణపాఠం చెప్పారన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను, ముఖ్యంగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను కొత్తగా అధికారంలోకి వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టల్స్ నాన్ టీచింగ్ వర్కర్లు, మున్సిపల్ వర్కర్లు, గ్రామపంచాయతీ, ఆశ, అంగన్వాడి, మధ్యాహ్న భోజనం కార్మికులు తమ వేతనాల పెంపు ఇతర సమస్యలను పరిష్కరిస్తుందని కొత్త ప్రభుత్వంపై విశ్వాసం ఏర్పరుచుకున్నారన్నారు. వీరి ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్, జిల్లా అధ్యక్షులు ఎం.ముత్తన్న, జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు డి.రాజేశ్వర్, ఎం.వెంకన్న జిల్లా సహాయ కార్యదర్శులు బీ.మల్లేష్, ఆర్. రమేష్, జిల్లా కోశాధికారి రవి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



కొత్తగూడెం సిపిఐ ఎమ్మెల్యేను జిల్లా నాయకులు బుధవారం రాష్ట్ర కార్యాలయం మగ్దుమ్ భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కామ్రేడ్ కూనంనేని సాంబశివరావుని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సు ధాకర్, జిల్లా నాయకులు వై. ఓమయ్య కలిసి శుభాకాం క్షలు తెలిపారు. ప్రజా సమస్యలపై, కార్మికుల సమస్యల పై నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వంతో ప్రజా, కార్మిక సమ స్యలు పరిష్కారం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఉద్యోగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తి సమస్యలు పరిష్కరిస్తానని సాంబశివరావు జిల్లా నాయకత్వానికి తెలిపారు.

అకాల వర్షం అపార నష్టం

- రూ.లక్షల్లో మిరప పంట నష్టం

నవతెలంగాణ-కోటపల్లి

మిచౌంగ్ తుఫాన్‌తో మండలంలో రైతులు ఇబ్బంది పడుతున్నారు. చేతికొచ్చిన పంట అకాల వర్షానికి తడిసి రూ.లక్షల్లో నష్టం వాటిల్లుతోంది. వరి ధాన్యం తడిసి పోవడంతో రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ఈ అకాల వర్షాలతో వరి, మిరప, పత్తి పంటలు తీవ్రస్థాయిలో దెబ్బతింటున్నాయి. మిరప పంట నిన్న, మొన్నటి వరకు వైరస్ తెగులుతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఇప్పుడే కుదురుకుంటున్న సమయంలో ఈ అకాల వర్షం పంటలను తీవ్రస్థాయిలో దెబ్బతీసింది. అలాగే పత్తి పంట ఈ వర్షం వల్ల నాన్యతో పాటు దిగుబడి కూడా తగ్గుతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వరి దిగుబడులను కొనుగోలు కేంద్రాల ఉంచితే ఈ వర్షం వల్ల తడిసిపోయింది. పంటలు వేసుకున్న సమాయానికి వర్షాలు లేక



మోటార్లతో నీరందించి సాగు చేసుకున్న పంటలు అకాల వర్షాలకు దెబ్బతినటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఏకరకు లక్షల్లో నష్టం

ఈ అకాల వర్షం వల్ల పంట నష్టం ఏకరాకు లక్షల్లో ఉంది. మిరప పంటకు ఇప్పటివరకు ఒక్క ఏకరాకు లక్షల్లో పెట్టుబడి అయితే పంట చేతికిచే సమయానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. మిరప పంట ఇప్పుడే అసలైన పూతకు వచ్చే సమయంలో ఈ మబ్బుల వల్ల పూత పూర్తిగా రాలి పోతోంది. అలాగే తెగులు వల్ల తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు ఆవేధన చెందుతున్నారు. దిగుబడి తగ్గి రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేని స్థితిలో రైతులు ఉన్నారు.



ప్రభుత్వమే ఆదుకోవాలి

మానెం రాజన్న, గ్రామం. పారుపల్లి

సమయానికి వర్షాలు కురవక అనుకున్న స్థాయిలో పంట దిగుబడులు రాక నష్టపోయామని భావిస్తున్న సమయంలో అకాల వర్షాలతో చేతికొచ్చిన కాస్త పంటలు వర్షం పాలవుతోంది. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం తడిసి పూర్తిగా నష్టపోతున్నాం. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి.

కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసిన ప్రజలకు ధన్యవాదాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు యాదగిరి తెలిపారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలని అన్నారు. పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ప్రకటించినందుకు సోనియా గాంధీకి, మల్లికార్జున్ ఖర్గే కి, రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలిపారు.



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నియమింపబడిన రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే కాలంలో అధికారంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని యాదగిరి తెలిపారు. తొమ్మిది సంవత్సరాల క్రితం సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్ర ప్రజల అభీష్టం మేరకు తెలంగాణ యువతకు ఉద్యోగాలు వస్తాయని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రన్ని ఇస్తే కెసిఆర్ అవినీతి చేస్తూ కుటుంబ పాలన చేశారని దానిని గమనించిన ప్రజలే వారికి బుద్ధి చెప్పారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చిన ప్రజలకు సేవ చేస్తూ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామని ఆయన అన్నారు. నిజామాబాద్ జిల్లా నుండి ఎమ్మెల్యేలు గా విజయం సాధించిన సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, మదన్ మోహన్ కి,లక్ష్మి కాంత్ రావు కి శుభాకాంక్షలు తెలిపా రు. కార్యక్రమంలో తరచంద్ నాయక్, రవి నాయక్,శ్రీను నాయక్, వేంకట్రం నాయక్,సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండలంలోని చౌట్ పల్లి గ్రామానికి చెందిన చిలువేరి రాజేశ్వర్ తన మొబైల్ ఫోన్ ఆగష్టు నెలలో పోగొట్టుకున్నాడు. ఈ విషయమై కమ్మర్ పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో ఎస్ఐ ఎం.రాజశేఖర్ మొబైల్ ఫోను ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారు. దాన్ని బుధవారం బాధితుడు చిలువేరి రాజేశ్వర్‌కు ఎస్ఐ రాజశేఖర్ పోలీస్ స్టేషన్లో అందజేశారు. బాధితుడు ఎస్ఐకి కృతజ్ఞతలు తెలిపారు.

వీడీసీ ఆధ్వర్యంలో నిత్యాన్నదానం



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం పలువురు అయ్యప్ప మాల ధారణ చేశారు. గురు స్వామి నంబి నరేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విడిసి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో గురు స్వాములు వడ్ల శ్రీనివాస్, సుధా సీడ్స్ నితిన్, మాచర్ల రమేష్ ,తిరుపతి, కన్నె సామి లక్కారం నలంద రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బేస్ బాల్ పోటీలకు మిట్టపల్లి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న మెచ్ఎం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 8 నుండి 9 వరకు మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ లో జరగనున్న 67వ స్కూల్ గేమ్స్ బేస్ బాల్ పోటీలకు మిట్టపల్లి పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు సుశీల్ కుమార్ బుధవారం తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో మెండే రాహుల్ 8వ తరగతి, బాలికల విభాగంలో గుండా స్నేహ 7 వ తరగతి ఎంపికయ్యారని అన్నారు. వారిని అభినందించి మాట్లాడుతూ.. రాష్ట్ర పోటీలో చక్కని ప్రతిభ కనబరిచి జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలిపి జాతీయ పోటీలకు ఎంపిక కావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవేందర్ రావు, పోశెట్టి,బాల్ రాజ్, నిరంజన్, శ్రీధర్ చారి, సురేష్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు మర్కంటి గంగా మోహన్ పాల్గొన్నారు.

బోధన్ పట్టణ సీఐ బదిలీ

నవతెలంగాణ-బోధన్



బోధన్ పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్‌ను ఉన్నతాధికారులు వీఆర్‌కు అటాచ్ చేస్తూ బదిలీ చేశారు. బోధన్ పట్టణ సీఐగా పని చేసిన ప్రేమ్ కుమార్ శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతుగా సమర్థవంతంగా విధులు నిర్వహించి సమర్థవంతమైన అధికారిగా పేరు సాధించారు. ఫ్రెండ్లి పోలీసులో భాగంగా రాగద్వేశాలకు అతీతంగా పట్టణ వాసులతో ఆయన స్నేహపూర్వకంగా మెలిగి పండగల సంధర్భంగ ఎలాంటి సంఘటనలు జరగకుండా విధులు నిర్వహించారు.

ప్రజాతీర్పును గౌరవిస్తున్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా తీర్పును గౌరవిస్తున్నాను అని బీఆర్ఎస్ నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. ఈ మేరకు బుధవారం నిజామాబాద్‌లో పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల నిర్వహించారు. ఈ సందర్భంగా బీగాల గణేష్ గుప్తా మాట్లాడుతూ.. తొమ్మిదిన్న సంవత్సరాలు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ప్రజలు అవకాశం కల్పించారని అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ఎక్కువ సమయం అభివృద్ధి పనులకు కేటాయించానని, నూతన సమీకృత కలెక్టర్ కార్యాలయం, ఐటి హబ్, మినీ ట్యాంక్ బండ్, రైల్వే వంతెన, వైకుంఠధామాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డివైడర్లు, అందమైన లైట్లు నిర్మాణం చేశానన్నారు. కుల సంఘాలను గౌరవిస్తూ కుల మతాలకు అతీతంగా కోట్ల రూపాయల భవనాలు నిర్మాణం కోసం సిడిపి నిధులు మంజూరు చేశానని తెలిపారు. ప్రజలు కష్టాల్లో ఉన్నపుడు కరోన విపత్కర సమయంలో, భారీ వర్షాలు కురిసినపుడు వారికి అండగా ఉంటూ ఉచితంగా భోజనం వితరణ చేసానని అన్నారు.కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, పింఛన్లు, సీఎం ఆర్ఎఫ్ చెక్కులు అందిస్తూ వారికి భరోసా ఇచ్చానని తెలిపారు. అధికార పార్టీ నాయ కులు కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అన్నారు. 2009లో ఎంపిగా పోటీ చేసి ఓడిపోయినా ప్రజలకు,కార్యకర్తలకు అందు బాటులో ఉన్నానని, సేవ చేయాలనే సంకల్పం ముందు ఎటువంటి పదవి అవ సరం లేదని తెలిపారు. నిజామాబాద్ ప్రజలకు ఎటువంటి ఆపద వచ్చిన సోదరునిలా అండగా ఉంటానని అన్నారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతు కిరణ్, రెడ్కో మాజీ చైర్మన్ ఎస్ఏ అలీం, నుడ మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మీర్ మజాజ్ అలీ, నవీద్ ఇక్బల్, సుజిత్ సింగ్ ఠాకూర్, సత్య ప్రకాష్, సిర్ప రాజు, యెనుగందుల మురళి ,రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎన్నారై పాలసీని అమలు చేయాలని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం ఎన్నారై అధ్యక్షులు బట్టు స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆకాంక్షలను నెరవేర్చాలని, పరిపాలనలో ప్రత్యేకమైన ముద్ర వేసి తెలంగాణ ప్రజల హృదయాలలో స్థానం సంపాదించుకోవాలని ఆకాంక్షించారు.

అంబేద్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

భారత రాజ్యాంగ నిర్మాత బలహీన వర్గాల హక్కుల పోరాట యోధుడు మాజీ కేంద్రమంత్రి భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పట్టణ బీజేపీ బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక బీజేపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్శ్మాల్ల పోశం, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మాసు సత్యనారాయణ, సోషల్ మీడియా మండల ఇన్‌ఛార్జి వేముల అశోక్, సీనియర్ నాయకులు దండు రాజేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి బంగారు ప్రసాద్, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి ఓరుగంటి సాయి, పట్టణ నాయకులు వైద్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : మండలంలోని రంగపేటలో అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకుని గ్రామ పెద్దలు కలమడుగు నర్సయ్య పంచాశీల జెండా ఎగురవేసి అంబేద్కర్‌కు నివాళు అర్పించించారు. ఈ కార్యక్రమంలో చిప్పకుర్తి నారాయణ, మండల నాయకులు తోటపల్లి మహేందర్, గ్రామ కమిటీ నాయకులు తోటపల్లి సతీష్, చిప్పకుర్తి శ్రీనివాస్, చొప్పదండి మనోహర్, బిరుదులు అక్షయ్, దాసరి రవి, చొప్పదండి బన్నీ పాల్గొన్నారు. అదేవిదంగా

మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఉత్కూరు చౌరస్తాలో అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెల్ల నాగభూషణం, బొప్ప సతీష్, రామిల్ల శారద, బాణల రమేష్ పాల్గొన్నారు.

నస్పూర్ : డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో పలువురు ఘన నివాళు లర్పించారు. అంబేద్కర్ 67వ వర్ధంతి పురస్కరించుకొని మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మనోజ్ కుమార్, తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు దాసరి వెంకటరమణ దంపతులు, టీం అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీసీసీ కార్నర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల నేతృత్వంలో జీఎం సంజీవరెడ్డి, ఎస్సీ ఎస్టీ లైసెన్స్ అధికారులు కిరణ్ కుమార్, శ్రీనివాస్ శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో ఘన నివాళులర్పించారు. ఆర్కే-8లోని బాబు జగ్జీవన్ రామ్ భవనంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మొగిలి చంద్రయ్య, శనిగారపు భూమయ్య, గోసిక రాజయ్య చిలుక మల్లేష్ ఆధ్వర్యంలో, సీసీసీ సెంటర్‌లో మాజీ ఎంపీటీసీ కొండ లింగయ్య పాల్గొన్నారు.

దండేపల్లి : మండల కేంద్రంలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 67 వర్ధంతి వేడుకలను దళిత సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు, మండల నాయకులు, దళిత సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్‌లో..

కాసిపేట : ప్రతి ఒక్కరూ మహనీయుని అడుగు జాడల్లో నడువాలని అంబేద్కర్ సంఘం కన్వీనర్ జాడి పోశం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం అంబేద్కర్ సంఘం కన్వీనర్‌గా జాడి పోశంను ఎన్నుకొని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లె మల్లయ్య, బన్న లక్ష్మణాదాస్, దాగం మల్లేశ్, లంక లక్ష్మణ్, వాల్దేవ్, గోలేటి స్వామి, రాంచందర్, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, అక్కెపల్లి లక్ష్మీ, చంద్రమౌళి, అగ్గ సత్తయ్య, మైదం రమేష్, సుధాకర్, కరీం పాల్గొన్నారు.

కాసిపేట గనిపై..

మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి, ఆయన సేవలను గుర్తు చేసుకొని యాడారు. అనంతరం పంచశీల పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ అల్లావుద్దీన్, ఎస్వీ సునీల్ కుమార్, వెల్ఫేర్ ఆఫీసర్ గౌస్ మిర్జా, కనుకల తిరుపతి, వొడ్నాల రాజన్న, దాగం మల్లేశ్, బన్న లక్ష్మణాదాస్, ఫిట్ కార్యదర్శి కృష్ణ, బైరి శంకర్, మీనుగు లక్ష్మీనారాయణ, సొల్లంకి శ్రీనివాస్, మైఖల్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతిని నిర్వహించారు. మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు నందిపాటి రాజు మాట్లాడుతూ అణగారిన వర్గాలు రాజ్యాధికారం సాధించినప్పుడే అంబేద్కర్ ఆశయాలు నెరవేరుతాయన్నారు. ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రచార కమిటీ నాయకులు మేడిరాజు, కల్లూరి క్రాంతి కుమార్, తెలంగాణ బీసీ జాగృతి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సదానందం, అసంఘటిత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టి. జైపాల్ సింగ్ పాల్గొన్నారు.

తాండూర్ : మండలంలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ సమాజానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు జాడిపోషం, నాయకులు ఎస్ మహేందర్ రావు, రామగౌని మహీధర్ గౌడ్, దాగం రాజారాం, పీక రవి, జైన సాంబయ్య, కేశెట్టి విజయ్ కుమార్, బానయ్య పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : కుమురంభీం కాలనీలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బ్రహ్మదేవ్ శర్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు గోడం గణేష్, మనోజ్, ముకుంద్, గోవింద్ రావ్, గంబీర్, దుర్వ రాజారాం పాల్గొన్నారు.

జయశంకర్ వ్యవసాయ కళాశాలలో

రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ 67వ వర్ధంతి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలలో నిర్వహించారు. అసోసియేషన్ డీన్ శ్రీధర్ చౌహాన్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అంబేద్కర్ అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ భాను రేఖ, సురేష్, దేవానంద్, బి రాజేశ్వర్, అనిత, నరేందర్, సంజీవ్, మమత, రవి, ప్రశాంత్, శ్రీనివాస్, తేజ పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో..

ఆదిలాబాద్ అర్బన్ : డాక్టర్ బీఆర్ అంబెద్కర్ వర్ధంతిని బుధవారం తెలుగు దేశం పార్టీ(టీడీపీ) ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ కార్యదర్శి ఆకుల రాము, పార్లమెంట్ కార్యదర్శి గంగసరపు ఓమన్న, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పతిహార ప్రభాకర్, మండల నాయకులు నరేందర్, అరె రాజన్న పాల్గొన్నారు.

నార్నూర్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్ గ్రామంలో దళిత సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మహార్ సంఘం నాయకులు మానే విశ్వ కళ్యాణ్, చంద్రమణి, కాంబ్లె శుద్దోదన్, కాంబ్లె చంద్రకాంత్, జాబాడే వినోద్, దేవ్‌రావ్ లోఖండే, మాజీ జెడ్పీటీసీ హేమలత బ్రిజులాల్, ఎంపీటీసీ పరమేశ్వర్, మీనాబాయి ఉన్నారు.



దండేపల్లిలో..



లక్షెట్టిపేటలో..



జన్నారంలో..



నస్పూర్‌లో..

గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకం

పెద్దపల్లి డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్

నవతెలంగాణ- పెద్దపల్లి:గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం 1994 పరిధి జిల్లా అడ్వైజరి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దపల్లి జిల్లాలో జరిగే ప్రసవాలలో వెయ్యి మంది మగ పిల్లలకు 926 మంది ఆడ పిల్లలు జన్మిస్తున్నారని, గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, పది వేలు జరిమానా పడుతుందని తెలిపారు. లింగ నిర్ధారణ అరికట్టుటకు ప్రతి నెల ఐదు స్కానింగ్ సెంటర్లను కార్యాలయ సిబ్బంది బందంతో తనిఖీ నిర్వస్తున్నామని అన్నారు. ఐఆర్‌సీఎస్ జిల్లా కన్వీనర్ కావేటి రాజగోపాల్ మాట్లాడుతూ.. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు లింగ నిర్ధారణ చేయకుండా ఉండే విధంగా చట్టంపై పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాకేష్, ప్రోగ్రామ్ అధికారి (యం.హెచ్.ఎన్) డాక్టర్ ఆర్. రాజమౌళి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవీందర్, డిప్యూటి డెమో యస్. వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి జిల్లాకు కీలక పదవి

- శ్రీధర్ బాబుకు మంత్రి పదవి లేదా స్పీకర్?
- నేడు సీఎం రేవంత్‌తో కలిసి మంత్రుల ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ- పెద్దపల్లి

తొమ్మిదేండ్ల తరువాత ఉమ్మడి కరీంనగర్‌లోని పెద్దపల్లి జిల్లాకు ప్రతిష్టాత్మక పదవి వరించనుంది. ప్రత్యేక రాష్ట్ర అనంతరం పెద్దపల్లి జిల్లాగా ఏర్పడింది. జిల్లాలో మూడు నియోజకవర్గాలు ఉన్నా.. రెండు పర్యాయాలు జిల్లాకు చెందిన వారికి ప్రభుత్వ పదవులు రాలేదు. ఈ సారి జరిగిన సాధారణ ఎన్నికల్లో జిల్లాలోని మూడు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. తొమ్మిదేండ్ల తరువాత మరోసారి జిల్లాకు చెందిన నేతకు ప్రభుత్వ పరిపాలనలో చోటు దక్కనుంది.

నేడు రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు క్యాబినెట్ మంత్రులు ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఇందులో మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు చోటు కల్పించినట్టు సమాచారం. ఉమ్మడి రాష్ట్రంలో మూడుసార్లుగా ఎమ్మెల్యే గెలుపొంది ఒకసారి మంత్రిగా, ప్రభుత్వ విప్పుగా పని చేసిన మంథని ఎమ్మెల్యే దుదిళ్ల శ్రీధర్ బాబుకు మంత్రి పదవి వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతోపాటు గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హాయంలో శ్రీపాదరావు స్పీకర్‌గా పని చేశారు. ఆయన తనయుడైన శ్రీధర్ బాబు రాష్ట్ర స్థాయిలో కీలక నేతగా ఉన్నారు. శ్రీధర్ బాబుకు కూడా అదే రాష్ట్ర స్పీకర్ పదవి వరించనుందా అనే సందేహాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్ర ముఖ్య మంత్రి ఎంపిక, ప్రమాణస్వీకారం ప్రక్రియ తోపాటు రాష్ట్ర మంత్రుల ఎన్నిక విషయంపై ఏఐసీసీ పరిశీలకులు చర్చ జరుపుతున్న నేపథ్యంలో జిల్లాకు చెందిన కీలక నాయకులైన శ్రీధర్‌బాబు విషయంలో కూడా అధిష్టానం వద్ద రెండు రోజులుగా చర్చ జరిగింది. శ్రీధర్‌బాబు తండ్రి చాలా సంవత్సరాలుగా అసెంబ్లీ స్పీకర్‌గా పని చేయడంతో శ్రీధర్‌బాబు కూడా కీలక పదవి రానున్నట్టు చర్చ జరుగుతోంది. ఇదే విషయంపై ఆయన కూడా రెండు రోజులుగా ఢిల్లీలో మకాం వేసినట్టు తెలుస్తోంది.

2023 నవంబర్ 30న జరిగిన సాధారణ ఎన్నికల్లో పెద్దపల్లి జిల్లా చెందిన మూడు నియోజకవర్గాల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. వారిలో డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్, రెండుసార్లు ఎమ్మెల్యేకు పోటీ చేసి ఓడిపోయి మూడోసారి పోటీచేసి భారీ మెజార్టీతో విజయ రమణారావు, ఐదో సారి అసెంబ్లీలో అడుగుపెడుతున్న శ్రీధర్‌బాబు ఉన్నారు. శ్రీధర్‌బాబుతో పాటు, సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నితుడిగా ఉన్న విజయ రమణారావుకి కూడా కీలక పదవి వస్తుందనే చర్చ జరుగుతోంది.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి



సారంగాపూర్‌లో...

నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఎస్సై తిరుపతి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూదూరి శోభన్, స్థానిక సర్పంచ్ గుర్రాల రాజేందర్‌రెడ్డి, అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షుడు మాలపు సుధాకర్, మాజీ ఎంపీటీసీ రామచందర్ రెడ్డి, అంబేద్కర్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజ్యం, శేఖర్ సంతోష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్:బాబా సాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో సామాజికంగా ఎదగాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ బి.ఎస్ లత అన్నారు. బుధవారం ఐడీవోసీలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ అభివృద్ధి అధికారి రాజ్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మి నారాయణ, డీఆర్డీవో నరేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్ల :పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ పూలమాల వేసి నివాళల ర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్న అనిల్, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురి :ధర్మపురి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు అధ్యక్షతన అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బత్తిని అరుణ, ఎంపీడీవో ఐనాల ప్రవీణ్ కుమార్, ఎంపీవో ఉప్పరపల్లి నరేష్ కుమార్, నక్కల పేట సర్పంచ్ మొగిలి శేఖర్, కౌన్సిలర్ తరాల కార్తీక్ ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అదేవిధంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు కౌన్సిలర్లు పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. వీరిలో 13వ వార్డు కౌన్సిలర్ జక్కు పద్మా రవీందర్. కౌన్సిలర్ నాగజ్యోతి. పలువురు పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

మంథని :మంథని మండల కేంద్రంలోని మంథని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంథని సీనియర్ సివిల్ జడ్జిలతో పాటు న్యాయ వాదులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు హరిబాబు,ఉపాధ్యక్షులు రగోత్తమరెడ్డి,ప్రధాన కార్యదర్శి సయేందర్ రెడ్డి,కార్యదర్శి విజయ్, కోశాధికారి బొట్ల అంజనేయులు, క్రీడా కార్యదర్శి కటకం శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు ఆర్ల నాగరాజు, శ్రీహరి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మంథనిలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్, బీఎస్పీ, ఎమ్మెస్పీ, నాగారం సర్పంచ్ ఆధ్వర్యంలో నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎంపీపీ కొండ.శంకర్, జనగామ నర్సింగరావు,ఐలి ప్రసాద్, నూకల బానయ్య,ఎరుకల ప్రవీణ్, హనుమంతరావు, అయోష, పెంద్రు రమ, మంథని సత్యం, బీఆర్ఎస్ నాయకులు వేల్పుల గట్టయ్య, మంతిని సత్యం, నక్క శంకర్, డిగంబర్, ఖలీల్ ఖాన్, ఆసిఫ్ ఖాన్, బాబా, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

జూలపల్లి :జూలపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్‌కు చిత్ర పటానికి ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు మామిడిపల్లి చంద్రశేఖర్ పూలమాల వేసి నివాలర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మొగురం రమేష్, సర్పంచ్ల ఫోరం జూలపల్లి మండల అధ్యక్షుడు దారా బోయిన నరసింహ యాదవ్ , ఎంపీటీసీల ఫోరం జూలపల్లి అధ్యక్షులు దండే వెంకటేశ్వర్లు, జూలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, తిరుపతి పాల్గొన్నారు.

గోదావరిఖని:

డాక్టర్ బీఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎల్లా హెటల్ వద్ద అంబేద్కర్ చిత్రటానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పూల మాల వేసి నివాళులు అర్పించారు.

గోదావరిఖని కొత్త కూరగాయల మార్కెట్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి ముఖ్య ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ హాజరై పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఏరియా ఎస్సీ లైసెన్ ఆఫీసర్ దొంత వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు లక్ష్మీనారాయణ, నాయకులు పులిమోహన్, యాట ఓదెలు మాతంగి రాయమల్లు, జనగాం మల్లేష్, జనగామ నర్సయ్య, రాంచందర్, వర్మ, యుగంధర్, గడ్డం శంకర్ తదితరులు పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకొని బుధవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి నగర పాలక సంస్థ మేయర్ బంగి అనిల్ కుమార్, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్ పూల మాల వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్లు వెంకట రమణా రెడ్డి, కుమ్మరి శ్రీనివాస్, నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిఖని టౌన్:ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో



మంథనిలో...

గోదావరిఖనిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, వన్‌టౌన్ సిఐ ప్రమోద్ రావు, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సతీష్ హాజరయ్యారు.

పెగడపల్లి:అంబేద్కర్ ఆశ సాధనకు యువత కృషి చేయాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. పెగడపల్లి మండల పరిధిలోని ల్యాగలమర్రి గ్రామంలో బుధవారం భారత నాస్తిక సమాజం ,అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు వడ్లూరి పెద్ద లింగయ్య, ఉప్పులేటి సత్యం, గంధం జగన్,కల్లేపెల్లి రాజు, ఎల్పుల శ్రీనివాస్, మొండయ్య, దేవయ్య తిరుపతి, అనిల్ పాల్గొన్నారు.

మంథని:మంథని ప్రభుత్వ సామాజిక వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు, మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అర్ల సందీప్, నాయకులు బావు రవి, ప్రసాద్, భాస్కర్, కృష్ణ పాల్గొన్నారు.

మెట్‌పల్లి :పట్టణంలోని అంబేద్కర్ పార్కులో ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, కౌన్సిలర్ షాకీర్, పాల్గొన్నారు.

రాయికల్ :పట్టణంలోని తపాలా కార్యాలయంలో తపాలా సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సబ్ పోస్ట్ మాస్టర్ బత్తుల రాజు, ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చెంగలి గంగాధర్, తపాలా సిబ్బంది బెక్కెం రాజ్ కుమార్, కంటె రమేష్, రాజేందర్, శ్రీధర్, విక్రమ్ శివాని, చక్రపాణి, మహేష్ పాల్గొన్నారు.

గోదావరిఖని:ఎన్టీపీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ పిటిఎస్‌లోని అంబేద్కర్ పార్క్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ముత్తారం:కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ విగ్రహానికి పూలమాల వేసి బుధవారం ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సి సేల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు గాధం శ్రీనివాస్, మండల యూత్ ఉపాధ్యక్షుడు బొడ రత్నాకర్, మాజీ సర్పంచ్ తాటిపాముల వకులరాణి శంకర్, వార్డ్ సభ్యులు గుడి రాములు, సంకుర్తుల ప్రకాష్ పాల్గొన్నారు.

మల్యాల:మల్యాల మండలంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు దొంగ ఆనంద రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నేరెళ్ల సతీష్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెల్మ లక్ష్మారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఆది రెడ్డి, లంబాడిపల్లి సర్పంచ్ తిరుపతి, పోతారం సర్పంచ్ హరీష్, మల్యాల ఎంపీటీసీ ఆగంతం రవళి, వంశీధర్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, పాల్గొన్నారు.

పెద్దపల్లి:పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండు వద్దగల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరెల్లి మల్లేష్. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్ జిల్లా కోశాధికారి సంకె రాజు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ రూరల్ :సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్ గ్రామంలో స్థానిక ఎంపీటీసీ మండల రమేష్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చంద్రమౌళి, గాలి పెళ్లి రాయమల్లు,కళ్ళపల్లి కుమార్,లవయ్య, చంద్రయ్య, రాయమల్లు, అంబేద్కర్ కాలనీ యువకులు కల్లపల్లి శ్రావణ్, మహేష్ పాల్గొన్నారు.



గోదావరిఖనిలో...



గోదావరిఖని: నివాళులర్పిస్తున్న రామగుండం ఎమ్మెల్యే



పెగడపల్లిలో...



జగిత్యాలలో...



కోరుట్లలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



మల్యాల మండలంలో...



సుల్తానాబాద్‌లో...

కన్నుల పండుగగా అయ్యప్ప ఆరట్టు ఉత్సవం

నవతెలంగాణ-రాయికల్

పట్టణంలో అయ్యప్ప ఆరట్టు ఉత్సవం కన్నుల పండుగగా జరిగింది. స్థానిక అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప మూలవిరాట్ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి ఆలయం నుంచి గాంధీచౌక్, పాతబస్టాండ్, పెద్ద చెరువు వరకు శోభాయాత్ర నిర్వహించారు. అయ్యప్ప ఆలయ పూజారి మునుగోటి సత్యనారాయణ శర్మ, సాయి శర్మ, గురు స్వాములు, అయ్యప్ప మాల ధారణ స్వాములు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సన్మానించిన జిల్లా అధికారులు




కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

అసెంబ్లీ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించిన కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషాను అధికారులకు సన్మానించారు. కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో ఆమెను కలిసి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. అదనపు కలెక్టర్ బి.ఎస్.లత, అధికారులు పాల్గొన్నారు.

సీఎంగా రేవంత్ రెడ్డిని నియమించడం పట్ల హర్షం

నవతెలంగాణ-గోదావరిఖని:



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన రేవంత్ రెడ్డిని రాష్ట్ర ముఖ్య మంత్రిగా అధిష్టానం నియమించడం పట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సుతారి లక్ష్మన్ బాబు హర్షం తెలిపారు. రామగుండం నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ శాసన సభ్యులుగా అత్యధిక మెజారిటీతో విజయం సాధించారని, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా రాజ్ ఠాకూర్ జిల్లాలో తనతో పాటు మొత్తం మూడు అసెంబ్లీ స్థానాల గెలుపుకు కృషి చేసిన సమర్థ నాయకత్వం పటిమను చూపించిన నాయకులు వీరికి కూడా ఉన్నత స్థాయిలో పదవులు రావాలని కోరుకున్నారు.

అనుమానస్పదంగా వ్యక్తి మృతి



నవతెలంగాణ-వెల్గటూర్

అనుమానస్పదంగా వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన వెల్గటూర్ మండలంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన నస్పూరి రాజన్న (42) ముత్యంపేట లో చికెన్ సెంటర్ నిర్వహిస్తూ వంటలు వండటం కోసం అత్తగారిళ్లయిన వెల్గటూర్ మండల కేంద్రానికి అప్పుడప్పుడు వస్తుంటాడాని బంధువులు పేర్కొన్నారు.

ఈ క్రమంలోనే రాజక్క పల్లి గ్రామానికి వచ్చిన అతడు కనిపించకుండా పోయాడని మృతుడి బావమరిది జయేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం మిస్సింగ్ కేసు చేసి నమోదు చేశారు. అయితే అదే రోజు సాయంత్రం రాజక్కపల్లి గ్రామానికి చెందిన సత్యం ఇంటి వద్ద గొడవ జరిగిందని వారు ఇతడి పై కారం పొడి చల్లి దాడి చేసి కొట్టగా తప్పించుకొని పారిపోయి పరుగెత్తి సమీపంలోని కాళేశ్వరం లింక్ టు జలాశయంలో దూకి ఈదుకుంటూ వెళ్తున్న క్రమంలో నీట మునిగి చనిపోయాడని పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులుధర్మాజీ సత్యం గంగారాం అనే వారి పై అనుమానం వ్యక్తం చేయాగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

నిత్యావసర సరుకులు అందజేత



నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్‌లోని అల్ఫోర్స్ ట్రైనీటాట్స్, వావిలాలపల్లి పాఠశాలలో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుచున్న విద్యార్థులు తమ వంతు సహాయంగా అనాథ ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు, అనాథ పిల్లలకు నిత్యావసర సరుకులు అందజేశారు. బియ్యం, పప్పులు, వంట నూనెలు, చక్కెర, పిండి దినుసులు తమకు తోచిన విధంగా పోగు చేసి అనాథ ఆశ్రమంలో ఇవ్వడానికి ముందుకు రావడం, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కూడా తమ వంతు సహాయం చేసినందుకు హర్షణీయమని, అభినందనీయమని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. కాగా ఈ నిత్యవసర వస్తువులను శ్రీవీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధుల ఆశ్రమం, నీయే అర్గనైజేషన్ కరీంనగర్ మేనేజర్‌లకు అందజేశారు.